సాక్షి
ములుగు

ఆదివారం | 23 | జూన్ | 2024



ప్రమాదం.. పసిగట్టొచ్చు

ఇక నుంచి ప్రకృతి ప్రమాదం పసిగట్టొచ్చు. పిడుగు, వర్షాలు, ఈదురుగాలుల లాంటి వైపరీత్యాలను ముందే తెలుసుకోవచ్చు.

- 8లో▸



రూ.529.44 కోట్ల రుణాల మాఫీ

వరంగల్ డీసీసీబీ ద్వారా రైతులకు ఇచ్చిన పంట రుణాలు రూ. 529.44 కోట్లు మాఫీ కానున్నాయని డీసీసీబీ చైర్మన్ రవీందర్ రావు చెప్పారు.

- 8లో▸

గరిష్ఠం/కనిష్ఠం
$31^0/26^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురుస్తుంది. సాయంత్రం ఆహ్లాదకరంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

బోధన పద్ధతులు పాటించాలి



మంగపేట: అంగన్‌వాడీ కేంద్రాల్లో నూతన పాఠ్య ప్రణాళిక బోధన పద్ధతులను తప్పనిసరిగా పాటించాలని ఏటూరునాగారం ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ హేమలత అన్నారు. మండలంలోని రాజుపేట రైతువేదికలో మండల పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లకు నూతన పాఠ్య ప్రణాళిక బోధనా పద్ధతులపై మూడు రోజుల శిక్షణ కార్యక్రమంలో భాగంగా మొదటి విడత 32 మంది టీచర్లకు శిక్షణ శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలకు ఆటపాటలతో అర్థమయ్యే విధంగా బోధన చేయాలన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ప్రతిఒక్కరూ విధులపై బాధ్యతగా సమయ పాలన పాటిస్తూ ప్రణాళికతో అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణను కొనసాగించాలన్నారు. ఇదే విధంగా రెండు, మూడవ బ్యాచ్‌కు ఒక్కో బ్యాచ్‌కు మూడు రోజుల పాటు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు సీడీపీఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ రమాదేవి(ట్రైనర్), ట్రైనింగ్ రీసోర్స్ పర్సన్లు కమల, తెల్లం విజయలక్ష్మి, చంద్రకళ, విజయకుమారి, శ్రీవిద్య, వసంత, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

29న హేమాచల క్షేత్రం సాగుభూముల కౌలు వేలం

మంగపేట: మండల పరిధిలోని మల్లూరు శ్రీ హేమాచల లక్ష్మీనర్సింహస్వామి దేవస్థానానికి చెందిన పట్టా భూములను సంవత్సరం కౌలుకు ఇచ్చేందుకు ఈ నెల 29న బహిరంగ వేలం పాట నిర్వహించనున్నట్లు ఆలయ ఇన్‌చార్జ్ ఈఓ శనిగల మహేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తాడ్వాయి మండల పరిధిలోని కాటాపురం రెవెన్యూ పరిధి(ఉప్పుకుంట)లో ఉన్న 26 ఎకరాల పట్టా సాగుభూమి గురించి గంగారం గ్రామ పంచాయతీ వద్ద ఈ నెల 29న ఉదయం 11 గంటలకు వేలం పాట నిర్వహించనున్నట్లు వెల్లడించారు. అదేవిధంగా ఏటూరునాగారం మండల పరిధిలోని శకరాజుపల్లిలోని 1.28ఎకరాల సాగు భూమిని మధ్యాహ్నం 2గంటలకు గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద వేలం పాట నిర్వహించనున్నట్లు తెలిపారు.

న్యాయం చేయాలని ఆందోళన



ఏటూరునాగారం: ఇసుక లారీలతో మృత్యువాత పడిన బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని శనివారం ఐటీడీఏ ఎదుట జాతీయ రహదారిపై బైఠాయించి బాధిత కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. నాలుగు నెలల క్రితం జీడివాగు ప్రాంతంలో గుర్తు తెలియని ఇసుక లారీ ఢీకొని బోడ శ్రీను, బండెల సాంబయ్య మృతి చెందారు. కాగా ఇప్పటివరకు కూడా పోలీసులు ఇసుక లారీలను గుర్తించలేదని తమ కుటుంబానికి ఎలాంటి న్యాయం జరగలేదని బాధితులు ఆందోళన బాటపట్టారు. ఈ క్రమంలో సీఐ శ్రీనివాస్, ఎస్సై తాజొద్దీన్ అక్కడికి చేరుకొని కుటుంబాలకు నచ్చజెప్పి న్యాయం చేస్తామని తెలపడంతో బాధితులు ఆందోళనను విరమించారు.

గోదావరికి హారతి



కాళేశ్వరం: కాళేశ్వరంలోని త్రివేణి సంగమ గోదావరిలో పౌర్ణమి సందర్భంగా గోదావరి హారతి కార్యక్రమాన్ని దేవస్థానం అధికారులు, అర్చకులు ఘనంగా నిర్వహించారు. శ్రీ కాళేశ్వర ముక్తీశ్వరస్వామి దేవస్థానం పరిధి త్రివేణి సంగమ గోదావరికి శనివారం కాళేశ్వరాలయం నుంచి మంగళ వాయిద్యాలు, వేదమంత్రాలతో, గోదావరి నది వద్దకు కాలినడకన వెళ్లారు. వేదపండితులు గోదావరి నదీ హారతి కార్యక్రమాన్ని ప్రత్యేక పూజాకార్యక్రమాలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

కాళేశ్వరాలయం పరిశీలన

కాళేశ్వరం: శ్రీకాళేశ్వర ముక్తీశ్వరస్వామి దేవస్థానాన్ని స్థపతి వల్లీనాయగం, ఇంజనీరింగ్ అధికారులు శనివారం పరిశీలించారు. కాళేశ్వరాలయం అనుబంధ దేవాలయమైన శ్రీ సరస్వతి ఆలయ ప్రాంగణంలో పాత సరస్వతి అమ్మవారి విగ్రహం, ఇతర పాత విగ్రహాలు, ప్రసాదశాల నుంచి శ్రీసరస్వతీ అమ్మవారిని దర్శించుకోవడానికి ఆలయానికి దారి కోసం పరిశీలించారు. కాళేశ్వరాలయం ఈఓ మారుతితో కలిసి పాత సరస్వతి విగ్రహం, ప్రసాదశాల నుంచి శ్రీసరస్వతి అమ్మవారిని దర్శించుకునేందుకు ప్రహరీ ద్వారం ఏర్పాటు చేయడానికి పరిశీలన చేశారు. ఆలయ ఈఓకు స్థపతి, ఇంజనీరింగ్ అధికారులు తగు సూచనలు ఇచ్చారు.

మలేరియా నియంత్రణే.. టార్గెట్

- ప్రతీ ఏడాది జిల్లాలో మలేరియా కేసులు తగ్గుముఖం
- నియంత్రణకు వైద్యశాఖ నిరంతరం అప్రమత్తం
- మారుమూల గ్రామాల్లో శిబిరాల నిర్వహణకు ప్రత్యేక టీమ్ లు
- అందుబాటులో మందులు, ఆర్‌డీటీ పరీక్ష కిట్లు
- ల్యాబ్ అసిస్టెంట్లకు బాధ్యతలు



గోవిందరావుపేట మండలం దేవుడిగుట్ట గొత్తికోయగూడెంలో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ రవీందర్

ములుగు: ఇప్పటికే మలేరియా ప్రభావిత ప్రాంతంగా ఉన్న ములుగు జిల్లాలో మలేరియా జ్వర నియంత్రణకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక అడుగులు వేస్తుంది. ఈ మేరకు ఇప్పటికే రాష్ట్రమంత్రి ధనసరి సీతక్క, కలెక్టర్ టీఎస్. దివాకర, అదనపు కలెక్టర్ శ్రీజలు అధికారులతో వేర్వేరుగా ప్రత్యేక సమీక్ష సమావేశాలను నిర్వహించి మలేరియా ప్రబలకుండా తీసుకునే చర్యలపై ప్రణాళికను సిద్ధం చేశారు. ఇందులో భాగంగా ఈనెల 18 నుంచి 21వ తేదీ వరకు గొత్తికోయగూడేలలో ప్రత్యేక వైద్య శిబిరాలను నిర్వహించారు. మొత్తం 7,723 మంది నుంచి శాంపిల్స్ సేకరించగా కేవలం 9కేసులు మాత్రమే పాజిటివ్‌గా నమోదయ్యాయి.

ప్రతీ ఏడాది తగ్గుముఖం పడుతున్న కేసులు

ములుగు జిల్లా ప్రస్తుతం మలేరియా ప్రభావిత ప్రాంతంగా రెడ్ జోన్‌లో ఉంది. అయితే గత ఐదు సంవత్సరాలతో పోలిస్తే జిల్లాలో మలేరియా కేసులు తగ్గుముఖం పడుతున్నాయి. వేసవికాలం మే నెలలో అసిస్టమాటిక్ సర్వే నిర్వహించిన వైద్యశాఖ వివరాల ప్రకారం ముందుకు అడుగులు వేసింది. ఈ సర్వేలో 7,845 మందికి టెస్టులు నిర్వహించగా 11 పాజిటివ్ కేసులు వచ్చాయి. ఎక్కువగా పాజిటివ్ వచ్చిన ప్రాంతాలను సర్వే చేయడంతో మలేరియా సోకిన వ్యక్తి నుంచి దోమ కారణంగా మరో వ్యక్తికి పాజిటివ్ రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవడానికి వీలుగా మారింది. జ్వర ప్రభావం ఎక్కువగా ఉన్న గ్రామాలలో రోజువారీగా దోమల మందు పిచికారీ చేయడం నీటి నిల్వలు ఉన్నచోట దోమల లార్వాలను తొలగించడం, పిచ్చి గడ్డి తొలగించి శుభ్రం చేయడం వంటి కార్యక్రమాలను ముమ్మరం చేశారు. ఇప్పటి వరకు కేవలం 22కేసులు మాత్రమే నమోదు కాగా వారికి అవసరమైన మందులను అందిస్తూ నయం అయ్యేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

జిల్లాలో 123హై రిస్క్ గ్రామాలు

జిల్లాలో 15పీహెచ్‌సీల పరిధిలో 123 గ్రామాలను వైద్యశాఖ హై రిస్క్ గ్రామాలుగా గుర్తించింది. ఇందులో రొయ్యూరు పీహెచ్‌సీ పరిధిలో 11, కన్నాయిగూడెం పీహెచ్‌సీలో 13, ఎస్ఎస్‌తాడ్వాయి పీహెచ్‌సీ పరిధిలో 15, కాటాపూర్ పీహెచ్‌సీ పరిధిలో 7, కొడిశాల పీహెచ్‌సీలో 15, పస్రా పీహెచ్‌సీ పరిధిలో 13, వాజేడు పీహెచ్‌సీలో 14, పేరూరు పీహెచ్‌సీలో 28, ఎదిర పీహెచ్‌సీ పరిధిలో 7 గ్రామాలు ఉన్నాయి. వీటితో పాటు మరో 60 చిన్నచిన్న గూడేలను సైతం పరిగణలోకి తీసుకున్నారు. గత ఏడాది సీజనల్ ముగిసేంత వరకు కేవలం 71 కేసులు నమోదు అయ్యాయి. వాటిని మరింతగా తగ్గించేందుకు జిల్లాలో పీహెచ్‌సీల వారీగా 15 ర్యాపిడ్ రెస్పాన్స్ టీంలను ఏర్పాటు చేశారు. వీరితో పాటు 89 సబ్‌సెంటర్ల వారీగా ఉన్న 34 మంది హెల్త్ అసిస్టెంట్‌లు, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలకు రోజువారీగా గ్రామాల్లో కలియతిరిగి జ్వర లక్షణాలు ఉన్న వారి నుంచి శాంపిల్స్ సేకరించే బాధ్యతలను అప్పగించారు. వర్షాకాలంలో వాగు దాటకుండా ఉన్న గ్రామాల్లో ఇప్పటికే టెస్టు కిట్లు, మందులు డంప్ చేశారు. డీఎంహెచ్‌ఓ అల్లెం అప్పయ్య ఆదేశాల మేరకు ప్రోగ్రాం ఆఫీసర్లు, స్థానిక వైద్యులు, సిబ్బంది గ్రామాల వారీగా అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. తరుచుగా జ్వరం రావడం, రోజు విడిచి రోజు జ్వరం రావడం, తలనొప్పి, చల్లచెమటలు పట్టి జ్వరం తగ్గడం వంటి లక్షణాలు ఉంటే సమీపంలోని సబ్ సెంటర్‌లో టెస్టు చేయించుకోవాలని సూచిస్తున్నారు. ఇదిలా ఉండగా సీజనల్ సమయంలో గ్రామీణ ప్రాంతాల ప్రజలకు ఉపయోగకరంగా అందించేందుకు త్వరలో 34వేల దోమ తెరలు జిల్లాకు రానున్నాయి.



రక్తనమూనా సేకరిస్తున్న డీఎంహెచ్‌ఓ అల్లెం అప్పయ్య



దోమల లార్వాలను పరిశీలిస్తున్న సబ్ యూనిట్ అధికారి దుర్గారావు

అందుబాటులో 38వేల ఆర్డీటీ కిట్లు



డీఎంహెచ్‌ఓ అల్లెం అప్పయ్య ఆదేశాలతో జిల్లాలో వైద్యపరంగా ఎలాంటి విపత్కర పరిస్థితులు ఎదురయినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నాం. ప్రస్తుతానికి 38వేల ఆర్డీటీ కిట్లు అందుబాటులో ఉన్నాయి. వాటిని ఆయా పీహెచ్‌సీల నుంచి సబ్ సెంటర్లకు తరలించాం. గత ఐదు సంవత్సరాలతో పోలిస్తే జిల్లాలో ప్రతీ ఏడాది మలేరియా కేసుల నమోదు తక్కువగా అవుతున్నాయి.

– డాక్టర్ పోరిక రవీందర్,
మలేరియా ప్రోగ్రాం ఆఫీసర్

పనులు వేగంగా పూర్తిచేయాలి

- అదనపు కలెక్టర్ శ్రీజ

ఏటూరునాగారం: అమ్మ ఆదర్శ పాఠశాలల మరమ్మతు పనులు చేపట్టి సకాలంలో పూర్తి చేయాలని ఐటీడీఏ ఇంజనీరింగ్ అధికారులను అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) శ్రీజ ఆదేశించారు. మండల పరిధిలోని దొడ్ల, మల్యాల, కొండాయి, షాపల్లిలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలు, ప్రభుత్వ బడులను, అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె శనివారం తనిఖీ చేశారు. ఐటీడీఏకు చెందిన పది విద్యాలయాలను అమ్మ ఆదర్శ పాఠశాల కింద ఎంపిక చేసి మరమ్మతు పనులు చేపట్టనున్నట్లు వెల్లడించారు. అలాగే మిషన్ భగీరథ సర్వేలను పరిశీలించారు. విద్యార్థులకు అనుగుణంగా పాఠశాలలను రూపొందించాలని, ఎలాంటి నాణ్యతా లోపాలు లేకుండా చూడాలన్నారు. విద్యార్థులకు ఏవిధంగా కూడా సమస్యలు లేకుండా చూడాలని, వారికి కావాల్సిన అవసరాలను తెలుసుకోవాలన్నారు. అలాగే మిషన్ భగీరథ సర్వేలు పూర్తి చేసి సమస్యలను, వివరాలను వెంటనే అప్‌లోడ్ చేయాలన్నారు. ఎవరు కూడా నిర్లక్ష్యం చేయొద్దని హెచ్చరించారు. ఆమె వెంట పంచాయతీ కార్యదర్శులు రంజిత్, సతీష్, ఏఈఈ లక్ష్మణ్ ఉన్నారు.



షాపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రం వద్ద పనులవివరాలను చెబుతున్న శ్రీజ

గోదావరిలోని తాత్కాలిక రోడ్డు తొలగింపు

కన్నాయిగూడెం: మండల పరిధిలోని తుపాకులగూడెం గ్రామం వద్ద గోదావరిపై నిర్మించిన సమ్మక్క సాగర్ బ్యారేజీ పనుల సమయంలో తాత్కాలికంగా గోదావరిలో నిర్మించిన రోడ్డు తొలగింపు పనులను అధికారులు శనివారం చేపట్టారు. బ్యారేజీ నిర్మాణం సమయంలో గోదావరిలో కాఫర్ డ్యామ్‌కు బ్యారేజీకి మధ్యలో తాత్కాలికంగా రోడ్డును నిర్మించి పనులను చేశారు. పనుల సమయంలో గోదావరి నీరు పోయే విధంగా కాంక్రీట్‌తో మోరీలను అమర్చి చిన్నపాటి వంతెన ఏర్పాటు చేశారు. ఆ రోడ్డు, మోరీలను తొలగించాలని అధికారులు ఆదేశాలు జారీ చేయడంతో కాంట్రాక్టర్ జేసీబీలతో తొలగిస్తున్నాడు. ఈ పనుల నిమిత్తం బ్యారేజీ 10గేట్లను ఎత్తి నీటిని దిగువకు వదులు తున్నారు.



జేసీబీలతో తొలగిస్తున్న రోడ్డు

'వామ్మో దెయ్యం' పై అవగాహన

సాక్షి స్పందన

గోవిందరావుపేట: మండల పరిధిలోని చల్వాయిలో గల వట్టివాగు పరిసరాల్లో దెయ్యం తిరుగుతుందని నాలుగు రోజులుగా పుకార్లు వస్తున్న నేపథ్యంలో శనివారం సాక్షిలో కథనం ప్రచురితమైంది. దీనిపై పస్రా ఎస్సై కమలాకర్ స్పందించారు. ఈ సందర్భంగా శనివారం చల్వాయి గ్రామంలో ప్రజలతో సమావేశం ఏర్పాటు చేసి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు రోజులుగా సోషల్ మీడియాలో చల్వాయిలోని వట్టివాగు పరిసరాల్లో దెయ్యం తిరుగుతుందని వస్తున్న మాటల్లో నిజం లేదన్నారు. సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న ఫొటో సైతం అవాస్తవమైందని తెలిపారు. మూఢ నమ్మకాలను ఎవరూ నమ్మవద్దని ప్రజలకు సూచించారు. వాట్సప్ గ్రూపులు, ఇతర సోషల్ మీడియాలో ప్రజలను భయభ్రాంతులకు గురిచేసే ఫొటోలు, వీడియోలు పెడితే గ్రూపు అడ్మిన్లపై, ఫొటోలు పెట్టిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్సై కమలాకర్

వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

- డీఎంహెచ్‌ఓ అల్లెం అప్పయ్య

ఎస్ఎస్‌తాడ్వాయి: వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల బారిన పడకుండా జాగ్రతలు తీసుకోవాలని డీఎంహెచ్‌ఓ అల్లెం అప్పయ్య అన్నారు. మండల పరిధిలోని లవ్వాల స్టేజీ సమీపంలో గల జలగలంచ గొత్తికోయ గూడెంలో తాడ్వాయి పీహెచ్‌సీ వైద్యాధికారి చిరంజీవి, సిబ్బంది శనివారం వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి గొత్తికోయలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరాన్ని డీఎంహెచ్‌ఓ అప్పయ్య సందర్శించి గూడెంలో జ్వరాలపై ఆరా తీశారు. ఇంటింటికీ తిరిగి పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. మురుగుగుంతలను పూడ్చివేయాలని ఆదివాసీ గొత్తికోయలకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల నివారణకు ముందస్తుగా వైద్య సేవలందిస్తున్నామని తెలిపారు. మలేరియా నిర్ధారణ పరీక్షలు చేస్తున్నట్లు తెలిపారు. వ్యాధుల బారిన పడిన వారు ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చి వైద్యం చేయించుకోవాలన్నారు. సీజనల్ వ్యాధుల ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పరిశుభ్రత చర్యలపై అవగాహన కల్పించారు. డీఎంహెచ్‌ఓ అప్పయ్య స్వయంగా గొత్తికోయ పిల్లల నుంచి రక్తనమునాలను సేకరించారు. మలేరియా మాస్ స్క్రీనింగ్ కార్యక్రమంలో భాగంగా మొండ్యాల తోగుగూడెంలో 77మంది నుంచి రక్తనమునాలను సేకరించినట్లు వైద్యాధికారి చిరంజీవి తెలిపారు. ఈ వైద్య శిబిరంలో డీపీఎంఓ సంజీవరావు, ఏఎన్ఎం మంగ, ఆశ వర్కర్ పాల్గొన్నారు.



ఆదివాసీ గొత్తికోయలతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ అప్పయ్య

ఇంటి స్థలాలు దక్కే వరకూ పోరాటం

వెంకటాపురం(కె): పేదలకు ఇంటి స్థలాలు దక్కే వరకూ పోరాటం చేయాలని, పేదల ఇంటి స్థలాల పోరాటానికి సీపీఎం అండగా ఉంటుందని పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు సూడి కృష్ణారెడ్డి అన్నారు. మండల పరిధిలోని బోదాపురంలో ఉన్న ప్రభుత్వ స్థలంలో ఆదివాసీల ఇంటి స్థలాల కోసం చేస్తున్న పోరాటం శనివారానికి నాల్గో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆ స్థలాన్ని ఆయన సందర్శించి మాట్లాడారు. ఇంటి స్థలం లేని ఆదివాసీలకు ప్రభుత్వం స్థలాలను కేటాయించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు భీరెడ్డి సాంబశివ, కుమ్మరి శ్రీను, కట్ల నర్సింహాచారి, కృష్ణ, రాము తదితరులు పాల్గొన్నారు.



ఆదివాసీలతో మాట్లాడుతున్న నాయకులు

సింగరేణి బొగ్గు బ్లాక్‌లను వేలం వేయొద్దు

భూపాలపల్లి అర్బన్: రాష్ట్రంలోని బొగ్గు బ్లాక్‌లను వేలం వేయొద్దని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బందు సాయిలు డిమాండ్ చేశారు. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సీఐటీయూ ఆధ్వర్యంలో శనివారం జిల్లాకేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సాయిలు మాట్లాడుతూ.. సింగరేణి ప్రైవేటీకరణను నిలుపుదల చేయాలని, సింగరేణికే బొగ్గు బావులను కేటాయించాలన్నారు. సింగరేణి ప్రాంతంలో బొగ్గు బ్లాక్‌లను వేలం వేయరాదని చెప్పారు. బొగ్గు బావులను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టడాన్ని ఆపాలని డిమాండ్ చేశారు. సింగరేణి కార్మికుల సమస్యలు పరిష్కరించాలన్నారు. సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులను పర్మనెంట్ చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో బీజేపీ మూడో సారి అధికారంలోకి వచ్చిన వెంటనే 67 బొగ్గు బ్లాక్‌లను వేసే ప్రయత్నం చేస్తుందన్నారు. ప్రైవేటీకరణతో సింగరేణి మనుగడకే ప్రమాదం పొంచి ఉందని ఆవేదన వ్యక్తంచేశారు. సింగరేణి రక్షణ కోసం సమరశీల పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజయ్య, రమేష్, రవికుమార్, సాంబయ్య, ప్రభాకర్, లక్ష్మి, శేఖర్ పాల్గొన్నారు.



అంబేడ్కర్ సెంటర్‌లో ధర్నాచేస్తున్న నాయకులు

రామప్ప దేవాలయాన్ని అభివృద్ధి చేయాలి

- కలెక్టర్ దివాకర

ములుగు: ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు పొందిన రామప్ప దేవాలయాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలని కలెక్టర్ టీఎస్.దివాకర అన్నారు. ఈ మేరకు శనివారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో పురావస్తు శాఖ అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ప్రసాద్ స్కీంలో భాగంగా జరుగుతున్న పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రసాద్ స్కీంలో భాగంగా 10 ఎకరాల విస్తీర్ణంలో రూ. 61.99 కోట్ల నిధులతో నిర్మాణం జరుగుతున్నా ఇంటర్ప్రిటేషన్ సెంటర్ పనులను వేగవంతం చేయాలన్నారు. ఆలయానికి వచ్చే పర్యాటకులకు స్టాల్స్, ఫుడ్ కోర్ట్స్, పార్క్, ఆడిటోరియం, టాయిలెట్స్, బ్యాటరీ వెహికిల్స్ వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు పొందిన అనంతరం యునెస్కో నియమ నిబంధనల ప్రకారం రామప్ప దేవాలయం పరిసరాలలో ఉన్న శివాలయం, గొల్లగుడి దేవాలయాలు, రామప్ప దేవాలయం ఒకే ప్రాంగణంలో ఉండాలని వాటికి సంబంధించిన సర్వేలు నిర్వహించాలని పురావస్తు శాఖ అధికారులకు సూచించారు. శివాలయం, గొల్లగుడి పరిసర ప్రాంతాలను త్వరలో పరిశీలిస్తానని తెలిపారు. ఈ సమావేశంలో కేంద్ర పురావస్తు శాఖ అసిస్టెంట్ సూపరింటెండెంట్ రోహిణి పాండే అంబేద్కర్, జిల్లా పురావస్తు శాఖ అధికారి ఎం.మల్లేష్, పురావస్తుశాఖ సర్వేయర్ ప్రశాంత్, ఏఈ విజయ్, క్షేత్ర ఫౌండేషన్ తరఫున సూర్యనారాయణ మూర్తి, కలెక్టరేట్ సూపరింటెండెంట్ శివ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వీడియో కాన్ఫరెన్స్

గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై దృష్టి పెట్టాలని, స్థానికంగా ఉన్న సమస్యలు, ఉపాధి వనరులు జీవనోపాధిలపై నివేదికలు సిద్ధం చేయాలని కలెక్టర్ టీఎస్ దివాకర అధికారులను ఆదేశించారు. ఈ మేరకు శనివారం తన ఛాంబర్ నుంచి జిల్లా అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మండల ప్రత్యేకాధికారులు, మండల, గ్రామస్థాయి అన్ని శాఖల అధికారులతో ప్రత్యక్ష సమావేశాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. గ్రామస్తుల ప్రధాన అవసరాలు, విద్య, ఆరోగ్యం, పౌష్టికాహారం, స్కిల్ డెవలప్‌మెంట్, వ్యవసాయం, హార్టికల్చర్, పశుపోషణ, మత్స్య సంపద వంటి అన్ని రంగాల వివరాలు నివేదికలో పొందుపరిచి సమర్పించాలని సూచించారు. అధికారులు సమర్పించిన నివేదికలను డిజిటలైజేషన్ చేయాలన్నారు. తద్వారా ఉద్యోగాల భర్తీకి ముందుకు వచ్చే కంపెనీలు, స్వచ్ఛంద సంస్థలకు గ్రామాల వారి పరిస్థితిలను సులభంగా అర్థమయ్యే రీతిలో వివరించే అవకాశం ఉంటుందన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ శ్రీజ, డీఆర్డీఓ శ్రీనివాస్ కుమార్, డీఎంహెచ్‌ఓ అప్పయ్య, డీడబ్ల్యూఓ స్వర్ణలత లెనిన, డీఈఓ పాణిని, డీసీఓ సర్దార్ సింగ్, మత్స్య శాఖ అధికారి శ్రీపతి, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, తదితరులు పాల్గొన్నారు.

సరిహద్దు స్తంభాలు ఏర్పాటు చేయాలి

గిరిజన విశ్వవిద్యాలయ స్థలం చుట్టూ సరిహద్దు స్తంభాలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ టీఎస్.దివాకర రెవెన్యూ అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని గట్టమ్మ దేవాలయం ఎదురుగా గిరిజన విశ్వవిద్యాలయానికి కేటాయించిన ప్రభుత్వ స్థలాన్ని ఆయన శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గిరిజన యూనివర్శిటీ కోసం మొత్తం 337 ఎకరాల స్థలాన్ని సేకరించినట్లు తెలిపారు. సంబంధిత స్థలాన్ని రెవెన్యూ అధికారులు ట్రైబల్ వెల్ఫేర్ శాఖకు బదలాయింపు చేశారని వివరించారు. ఈ సంవత్సరం యూనివర్సిటీ ఏర్పాటులో భాగంగా తాత్కాలికంగా తరగతులు జాకారం సమీపంలోని ట్రైబల్ యూత్ ట్రైనింగ్ సెంటర్(వైటీసీ)లో ప్రారంభం కానున్నాయని తెలిపారు. యూనివర్సిటీ స్థలాన్ని ఎవరైనా ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ (రెవెన్యూ) సీహెచ్ మహేందర్ జీ, ఆర్డీఓ సత్యపాల్ రెడ్డి, తహసీల్దార్ విజయ భాస్కర్, ఆర్ఐ విజేందర్ తదితరులు పాల్గొన్నారు.



పురావస్తు శాఖ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ దివాకర



గిరిజన యూనివర్సిటీకి కేటాయించిన స్థలం మ్యాప్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

ముగ్గురిపై కేసు నమోదు

ములుగు రూరల్: అదనపు కట్నం కోసం వేధింపులకు పాల్పడిన ముగ్గురిపై కేసు నమోదైన సంఘటన శనివారం చోటు చేసుకుంది. ఎస్సై వెంకటేశ్వర్‌రావు కథనం ప్రకారం.. ములుగు మండలం రాంచంద్రాపురానికి చెందిన కుదిపాక మమతను 2016లో వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం తొగర్రాయికి చెందిన గోపికిచ్చి వివాహం జరిపించారు. ఇద్దరు పిల్లలు పుట్టిన తర్వాత భర్త గోపి, అత్తమ్మ బుచ్చమ్మ, మామ సాంబయ్యలు తరుచు అదనపు కట్నం కోసం మమతను వేధిస్తున్నారు. నాలుగు నెలలుగా మమత పుట్టింటిలో ఉంటుందని కాపురానికి తీసుకు పోకుండా కట్నం కోసం వేధించడంతో ములుగు పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు విచారణ జరిపి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

'పూర్వీకుల ఆచారాలను కొనసాగిస్తున్నాం'

ములుగు రూరల్: పూర్వీకుల ఆచార ప్రకారం వరద పాశం వేడుకలను నిర్వహిస్తున్నామని దేవుని గుట్ట ఆలయ కమిటీ అధ్యక్షుడు వీరమనేని కిషన్‌రావు అన్నారు. ఈ మేరకు శనివారం కొత్తూరు సమీపంలోని దేవునిగుట్టపై నెలకొన్న లక్ష్మీ నర్సింహస్వామి ఆలయం వద్ద శనివారం వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఏటా వర్షాకాలం ప్రారంభంలో వర్షాలు సమృద్ధిగా కురిసి పాడి పంటలతో రైతులు సుఖసంతోషాలతో ఉండాలని వరద పాశం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గుట్టపై పాయసం తయారు చేసి లక్ష్మీనర్సింహస్వామికి నైవేద్యం సమర్పించిన అనంతరం ఆలయ సమీపంలోని బండరాళ్లపై వరద పాశం ఉంచి నోటితో ఆరగిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అక్కల సంపత్, చంద్రమోహన్, సుదర్శన్, రమేష్, రవీందర్‌రావు, రాంబాబు, సమ్మిరెడ్డి, రాజ్‌కుమార్, మాదవులు, మల్లయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.



వరద పాశాన్ని స్వీకరిస్తున్న కొత్తూరు గ్రామస్తులు

క్లుప్తంగా

మహదేవపూర్ సీఐ బదిలీ

కాళేశ్వరం: మహదేవపూర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బి.రాజేశ్వర్‌రావు బదిలీ అయ్యారు. ఈ మేరకు మల్టీజోన్–1 ఐజీ ఏ.వి. రంగనాథ్.. రాజేశ్వర్ రావును ఐజీ ఆఫీస్‌కు అటాచ్ చేస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. రాజేశ్వర్‌రావు ఏడు నెలల క్రితం మహదేవపూర్ సీఐగా బాధ్యతలు చేపట్టారు. కాగా, ఏప్రిల్ 15న మహదేవపూర్ పీఎస్‌లో జెడ్పీటీసీ భర్త డ్యాన్స్ చేసిన వీడియో వైరల్ కావడంతో అప్పటి ఎస్సై, కానిస్టేబుళ్లను బదిలీ చేశారు. మూడు రోజుల క్రితం కాళేశ్వరం ఎస్సై తన పీఎస్‌లోని ఓ మహిళా హెడ్‌కానిస్టేబుల్‌పై లైంగిక దాడికి పాల్పడిన ఘటన రాష్ట్ర వ్యాప్తంగా సంచలనంగా మారింది. దీంతో ఎస్సైని సర్వీస్ నుంచి తొలగించారు. ఈ రెండు ఘటనలు సర్కిల్ పరిధిలో శాంతిభద్రతలపై ప్రభావం చూపుతాయనే నేపథ్యంలో సీఐపై బదిలీ వేటు వేసినట్లు తెలిసింది.

విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి


విజేతలతో అతిథులు

హన్మకొండ : విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని హనుమకొండ ఇన్‌స్పెక్టర్ వై.సతీష్, ఆర్టీసీ వరంగల్ రీజియన్ డిప్యూటీ ఆర్‌ఎం మాధవ రావు అన్నారు. 'లక్షే లక్ష్యం–టీజీఎస్ ఆర్టీసీ ఉద్యోగుల కర్తవ్యం' అనే అంశంపై ఆర్టీసీ ఉద్యోగుల పిల్లలకు శనివారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. హనుమకొండలోని ఆర్టీసీ వరంగల్–1 డిపోలో నిర్వహించిన కార్యక్రమంలో విజేతలకు, అలాగే పది, ఇంటర్, జేఈఈలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసపత్రాలు, బహుమతులు అందించి సన్మానించారు. ఈ సందర్భంగా సతీష్, మాధవరావు మాట్లాడుతూ లక్షే లక్ష్యం సాధించి వరంగల్–1 డిపోను లాభాల బాటలో నడిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ వంగల మోహన్ రావు, అసిస్టెంట్ ఇంజనీర్ (మెకానికల్) టి.శ్రీనివాసులు, అసిస్టెంట్ మేనేజర్ (ట్రాఫిక్) సీ.హెచ్ సంతోష్ కుమార్, ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదం.. పసిగట్టొచ్చు

పిడుగులు, వర్షం సమాచారం ముందే తెలుసుకోవచ్చు
- వాతావరణ పరిస్థితులపై ఎప్పటికప్పుడు సమాచారం
- పలు యాప్‌లను తీసుకొచ్చిన కేంద్రం

భూపాలపల్లి అర్బన్: ఇక నుంచి ప్రకృతి ప్రమాదం పసిగట్టొచ్చు. పిడుగు, వర్షాలు, ఈదురుగాలుల లాంటి వైపరీత్యాలను ముందే తెలుసుకోవచ్చు. ఇవి ఎప్పుడు? ఎక్కడ పడతాయో.. తెలియని పరిస్థితి. వీటివల్ల మనుషులు, మూగజీవాలు మృత్యువాత పడిన ఘటనలు అనేకం. గతేడాది చిట్యాల మండలం కైలాపూర్ సమీపంలో మిరప తోటలో పని చేస్తుండగా ఇద్దరు మహిళలపై పిడుగు పడగా వారు అక్కడికక్కడే మృతి చెందారు. అలాగే, ఈ ఏడాది మే, జూన్ మాసాల్లో ఉరుములతో కూడిన పిడుగులు పడి పలు మండలాల్లో రైతులు చనిపోగా మూగజీవాలు మృత్యువాత పడ్డాయి. ఇలాంటి ఘటనలు నిత్యం ఏదో చోట కోకొల్లలుగా చోటుచేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో అన్నదాతలకు అండగా నిలిచేందుకు కేంద్ర ప్రభుత్వం భారత వాతావరణ శాఖ ద్వారా పలు యాప్‌లు తీసుకువచ్చింది. ఇంటర్ నెట్ ద్వారా వాటిని డౌన్‌లోడ్ చేసుకుంటే పిడుగు, వర్షం ఎప్పుడు పడుతుందో ఇట్టే తెలిసిపోతుంది. తదనుగుణంగా రైతన్న వ్యవహరిస్తే చాలు.. యాప్‌లతో మరో ఐదు రోజుల వరకు వాతావరణ పరిస్థితులు ఎలా ఉంటాయో తెలుసుకునే వీలు కల్పించింది.

రెయిన్ అలారం..



గూగుల్ ప్లే స్టోర్ నుంచి రెయిన్ అలారం అని ఇంగ్లిష్‌లో టైప్ చేస్తే ఈ యాప్ కనిపిస్తుంది. కేవలం ఒక నిమిషంలో డౌన్‌లోడ్ అవుతుంది. వినియోగదారుడు అందించిన వివరాల మేరకు అతను ఉన్న ప్రాంతానికి సమీపంలోని 20 కిలోమీటర్ల దూరంలో ఎక్కడ వర్షం పడే సూచనలున్నాయో సమగ్ర సమాచారం క్షణాల మీద అందిస్తుంది. దీంతో వర్షం ముప్పు తెలుసుకొని, ముందే జాగ్రత్తపడే అవకాశం ఉంటుంది.

దామినీ యాప్..



సాధారణంగా వర్షాకాలంతోపాటు ఏప్రిల్, మే నెలల్లో పిడుగులు పడడం సహజం. వ్యవసాయ పనుల హడావుడిలో ఉండే రైతులు పిడుగు పడే సమయంలో దగ్గరలోని ఎత్తయిన చెట్ల కిందకో, మరోచోటుకో వెళ్తుంటారు. అవి అంత సురక్షితం కాదని నిపుణులు చెబుతున్నారు. ఇలాంటి సందర్భాల్లో రైతులను అప్రమత్తం చేసేదే 'దామినీ' యాప్. దీనిని కూడా గూగుల్ ప్లేస్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఇది సమీపంలోని 20 కిలోమీటర్ల దూరంలో 5 నుంచి 20 నిమిషాల్లో ఎక్కడ పిడుగు పడుతుందో అప్రమత్తం చేస్తుంది. దీనివల్ల సురక్షిత ప్రాంతాలకు వెళ్లొచ్చు.

విడివిడిగా డౌన్‌లోడ్ చేసుకోవాలి..

ప్లే స్టోర్ నుంచి మూడు యాప్‌లను విడివిడిగా డౌన్‌లోడ్ చేసుకోవాలి. ప్రతీ యాప్‌నకు వినియోగదారుడి వివరాలు ఇవ్వాల్సి ఉంటుంది. అప్పుడే సరైన సమాచారాన్ని సకాలంలో అందిస్తాయి.

మేఘదూత్ యాప్..



పంట చేలకు ఎరువులు అందించాల్సిన సమయంలో లేదా వరి కోతల సందర్భంలో రైతులకు నష్టం చేసేవి వర్షాలే. దీనిని తప్పించేందుకు భారత వాతావరణ శాఖ మేఘదూత్ యాప్‌నకు రూపకల్పన చేసింది. గూగుల్ ప్లే స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుంటే తాజా సమాచారం అందిస్తుంది. రాబోయే 5 రోజుల్లో వాతావరణ మార్పులు, వర్ష సూచనలు సహా ఆకాశం మేఘావృతమవుతుందా లేదా గాలులు ఏ మేరకు ఎక్కడి నుంచి ఎక్కడకు ఏ దిశగా వీస్తాయో తెలుపుతుంది.

గంజాయి మహమ్మారి నిర్మూలనకు చర్యలు

- రాష్ట్ర మంత్రి సీతక్క



సాక్షి, మహబూబాబాద్ : గంజాయికి బానిసై కొందరు మృగాళ్లు తయారవుతున్నారని, ఈ మహమ్మారిని రాష్ట్రంలో పూర్తిగా నిర్మూలించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని పోలీస్‌శాఖను ఆదేశించినట్లు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి ధనసరి అనసూయ(సీతక్క) అన్నారు. శనివారం మహబూబాబాద్ కలెక్టర్ కార్యాలయంలో జిల్లా అభివృద్ధిపై ఆమె సమీక్ష నిర్వహించారు. అనంతరం మంత్రి విలేకరులతో మాట్లాడారు. గంజాయి రవాణాతోపాటు, రాష్ట్రంలో విక్రయాలు జరగకుండా చూడాలన్నారు. గత ప్రభుత్వం హయాంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమయ్యాయన్నారు. భూములు ఆక్రమించుకున్న వారిలో ఎంత పెద్దవారున్నా సహించేది లేదన్నారు. డాక్టర్ కావాలని ఎంతో ఆశతో కష్టపడి చదివిన పిల్లల భవిష్యత్‌తో కేంద్ర ప్రభుత్వం ఆటలాడుకుంటుందని చెప్పారు. నీట్ పేపర్ లీకేజీ చేసి వారికి అనుకూలమైన ఇచ్చారని ఆరోపించారు. పేపర్ లీకేజీపై పూర్తిస్థాయిలో దర్యాప్తు జరపాలని, మరోసారి ఇలాంటి సంఘటనలు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్, ప్రభుత్వ విప్ రాంచంద్రు నాయక్, ఎమ్మెల్యే మురళీ నాయక్ ఉన్నారు.

రూ.529.44 కోట్ల రుణాల మాఫీ

- వరంగల్ డీసీసీబీ ఛైర్మన్ రవీందర్ రావు


మాట్లాడుతున్న డీసీసీబీ ఛైర్మన్ రవీందర్‌రావు

హన్మకొండ: వరంగల్ జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ ద్వారా రైతులకు ఇచ్చిన పంట రుణాలు రూ.529.44 కోట్లు మాఫీ కానున్నాయని డీసీసీబీ, టీఎస్ కాబ్ ఛైర్మన్ మార్నేని రవీందర్ రావు చెప్పారు. శనివారం హనుమకొండలోని వరంగల్ డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలో 78,432 మంది రైతుల పంట రుణాలు రూ.529.44 కోట్ల రుణమాఫీ ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపామని వివరించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర ప్రభుత్వం రూ.2 లక్షల రుణమాఫీని ఒకే విడతలో చేయాలని చారిత్రాత్మక నిర్ణయం తీసుకుందన్నారు. దేశంలో ఏ ప్రభుత్వం ఇలాంటి నిర్ణయం తీసుకోలేదని, రూ.2 లక్షల రుణమాఫీ చేయలేదన్నారు. తెలంగాణలో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి వర్గం తీసుకున్న గొప్ప నిర్ణయమన్నారు. దీంతో రైతులకు రూ.2 లక్షల వరకు లబ్ధి చేకూరనుందన్నారు. మాఫీ చేసిన రైతులకు తిరిగి రుణాలు ఇవ్వనున్నట్లు చెప్పారు. ఆగస్టు 15లోపు రుణమాఫీ చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. అనంతరం డీసీసీబీ కార్యాలయ ఆవరణలో సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. సమావేశంలో డీసీసీబీ సీఈఓ ఎండీ వజీర్ సుల్తాన్, జీఎం శ్రీధర్, డైరెక్టర్లు కక్కిరాల హరిప్రసాద్, చెట్టుపల్లి మురళీధర్, యెలుగం రవితేజ, చాపల యాదగిరి రెడ్డి, సంపల్లి నర్సింగరావు, ఎన్నమనేని జగన్ మోహన్ రావు, కె.నరేందర్ పాల్గొన్నారు.

కొడుకు కళ్లెదుటే.. ప్రాణం పోయింది

- విద్యుదాఘాతంతో తండ్రి మృతి
- రాజులకొత్తపల్లిలో ఘటన


వెంకన్న మృతదేహం

నెల్లికుదురు : కొడుకు కళ్లెదుటే.. తండ్రి ప్రాణం పోయింది. తండ్రి విద్యుదాఘాతానికి గురికాగా కొడుకు కాపాడే ప్రయత్నం చేసినా ఫలితం లేకుండా పోయింది. మాయదారి మృత్యువు అప్పటికే బలితీసుకుంది. ఈ విషాదకర ఘటన మండలంలోని రాజులకొత్తపల్లిలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన లింగాల వెంకన్న (49) తనకున్న భూమితోపాటు మరో రెండు ఎకరాలు కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నాడు. శనివారం వ్యవసాయ భూమి వద్ద నారు మడి సాగు నిమిత్తం విద్యుత్ బోరు మోటార్ బిగించేందుకు రెండో కుమారుడు ఉపేందర్‌తో కలసి మరమ్మతులు చేస్తున్నాడు. కొడుకు మోటార్ వద్ద ఉండగా వెంకన్న తీగలు సరి చేసుకుంటు వస్తున్నాడు. ఈ క్రమంలో అతుకులు పడిన సర్వీస్ వైరును చూసుకోకుండా మరమ్మతులు చేస్తుండగా విద్యుత్ సరఫరా అయి షాక్‌కు గురై పడిపోయాడు. గమనించిన ఉపేందర్ విద్యుత్ తీగలను తొలగించి వచ్చి చూసేవరకు అప్పటికే వెంకన్న మృతి చెందాడు. తండ్రి తన కళ్లెదుటే ప్రాణం కోల్పోతుంటే కాపాడుకోలేక పోయానని ఉపేందర్ గుండెలవిసేలా రోదించారు. వెంకన్న మృతితో ఆయన కుటుంబంతోపాటు రాజులకొత్తపల్లిలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతుడికి భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు.


రామకిష్టాపూర్(టీ)లో మహిళ..


వెంకటలక్ష్మి(ఫైల్)

టేకుమట్ల: విద్యుత్ ఘాతంతో ఓ మహిళ మృతి చెందగా, మరో మహిళ తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతోంది. ఈ ఘటన శనివారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం రామకిష్టాపూర్(టీ)లో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. పెద్దపల్లి జిల్లా గోదావరిఖని 8ఇంక్లైన్ సంతోష్‌నగర్‌కు చెందిన గాజుల వెంకటలక్ష్మి(48) తన భర్త భిక్షపతితో కలిసి కూతురు భవానీని చూసేందుకు శుక్రవారం రామకిష్టాపూర్(టీ)కు వచ్చింది. రాత్రి కురిసిన వర్షానికి డోర్ పరదా పూర్తిగా తడవడంతో దానిని తీసి దండెంపై ఆరవేస్తున్న క్రమంలో విద్యుదాఘాతానికి గురైంది. గమనించిన ఆమె వియ్యంకురాలు బూర నిర్మల.. వెంకటలక్ష్మిని కాపాడే ప్రయత్నం చేయడంతో ఆమె కూడా విద్యుదాఘాతానికి గురైంది. గమనించిన కుటుంబీకులు విద్యుత్ మేన్ ఆఫ్ చేసి అపస్మారక స్థితికి చేరుకున్న ఇద్దరిని 108లో చిట్యాల సివిల్ ఆసుపత్రికి తరలించారు. కాగా, అప్పటికే వెంకటలక్ష్మి మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. నిర్మల చికిత్స పొందుతున్నట్లు తెలిపారు. ఈ ఘటనపై మృతురాలి కూతురు భవానీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై కుమారస్వామి తెలిపారు.

ఒలింపిక్స్‌లో గెలుపే లక్ష్యం..

- జాతీయ స్థాయిలో రాణిస్తున్న క్రీడాకారులు
- నేడు ఇంటర్నేషనల్ ఒలింపిక్స్ డే



వరంగల్ స్పోర్ట్స్ : పట్టుదల, క్రమశిక్షణ, నిత్యసాధనతో లక్ష్యాన్ని చేరుకోవచ్చు. గురువుల సూచనలతో జాతీయ స్థాయిలో పతకాలను సాధిస్తూ అనుకున్న లక్ష్యానికి చేరువలో ఉన్నారు. ఇప్పటికే అనేక జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్న జిల్లా క్రీడాకారులు ఎప్పటికైనా ఒలింపిక్స్‌లో పాల్గొని దేశానికి వన్నె తెచ్చేలా పతకాలను సాధించడమే ఏకైక లక్ష్యమంటున్నారు. వచ్చే నెల నుంచి ఆగస్టు 11వ తేదీ వరకు పారిస్‌లో నిర్వహించనున్న ఒలింపిక్స్ క్రీడల్లో పాల్గొనేందుకు భారత క్రీడాకారులు సమాయత్తం అవుతున్నారు. నేడు ఇంటర్నేషనల్ ఒలింపిక్స్‌డేను పురస్కరించుకుని పలువురు జిల్లా క్రీడాకారుల అభిప్రాయాలు 'సాక్షి' పాఠకుల కోసం.

కోచ్ వద్ద నిత్య సాధన



మా నాన్న స్ఫూర్తితో జాతీయ స్థాయి స్విమ్మింగ్ పోటీల్లో పాల్గొని పతకాలు తీసుకొచ్చా. ఫ్రీస్టైల్, బ్యాక్ స్ట్రోక్, బటర్ ఫ్లై, బ్రెస్ట్ స్ట్రోక్ ఈవెంట్లలో కోచ్ నవీన్ వద్ద నిత్యం సాధన చేస్తున్నా. ఎప్పటికైనా ఒలింపిక్స్‌లో పాల్గొని పతకాలు సాధించాలన్నదే లక్ష్యం.

– కట్ల ధీరజ్, స్విమ్మర్, హనుమకొండ

పీవీ సింధు స్ఫూర్తితోనే..



చిన్నప్పటి నుంచి హనుమకొండ జేఎన్ ఇండోర్ స్టేడియంలో కోచ్ రమేశ్ వద్ద శిక్షణ పొందా. ప్రస్తుతం హైదరాబాద్‌లోని పుల్లెల గోపీచంద్ అకాడమీలో శిక్షణ తీసుకుంటున్నా. పీవీ సింధు స్ఫూర్తితో బ్యాడ్మింటన్‌లో రాణిస్తున్నా. ఎప్పటికైనా ఒలింపిక్స్‌లో పాల్గొని సత్తా చాటాలన్నదే ఏకైక లక్ష్యం.

– ఎం కీర్తి, బ్యాడ్మింటన్ క్రీడాకారిణి, హనుమకొండ

బంగారు పతకమే లక్ష్యం


మెడల్స్‌తో జీవంజి దీప్తి

పర్వతగిరి : వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం కల్లెడ గ్రామానికి చెందిన జీవంజి దీప్తి అంతర్జాతీయ స్థాయి అథ్లెటిక్ పోటీల్లో రాణిస్తోంది. పేద రికంలో పుట్టిన జీవన్‌జీ దీప్తి తండ్రి యాదగిరి, తల్లి ధనలక్ష్మి గ్రామంలో వ్యవసాయ కూలీలుగా పని చేస్తుంటారు.కాగా దీప్తి ఇంటలిజెన్స్ కోషియంట్ (ఐక్యూ) సమస్యతో బాధపడేది. దీప్తి కల్లెడ ఆర్డీఎఫ్ పాఠశాలలో గణతంత్ర దినోత్సవ సందర్భంగా జరిగిన పోటీల్లో ప్రతిభ చాటింది. అప్పటి నుంచి వెనుతిరగకుండా జిల్లా, రాష్ట్ర, జాతీయ,అంతర్జాతీయ స్థాయిలో ఎన్నో పతకాలను సొంతం చేసుకుంది. కాగా, తన ప్రతిభను గుర్తించిన వ్యాయామ ఉపాధ్యాయుడు వెంకటేశ్వర్లు, అథ్లెటిక్ కోచ్ నాగపూరి రమేశ్ అందుకు సహకరించిన ఎర్రబెల్లి రాంమోహన్‌రావుకు రుణపడి ఉంటానని, అలాగే దేశం తరపున ఒలింపిక్‌లో పాల్గొని బంగారు పతకం సాధించాలనేదే ఆమె లక్ష్యంగా తెలిపింది.

స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగమే లక్ష్యం



చిన్నప్పటి నుంచి సాఫ్ట్‌బాల్ అంటే చాలా ఇష్టం. స్కూల్ సమయంలో సాధన చేయలేకపోయాను. ఇంటర్మీడియట్ నుంచి సాఫ్ట్‌బాల్‌లో పూర్తిస్థాయి శిక్షణ ప్రారంభించాను. 2018 నుంచి ఇప్పటి వరకు అనేక రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని పతకాలు సాధించాను. జపాన్‌లో జరిగే ఏషియన్ గేమ్స్‌లో పాల్గొనే భారత్ జట్టుకు సైతం అర్హత సాధించాను. ఎప్పటికైనా స్పోర్ట్స్ కోటాలో గ్రూప్–1 ఉద్యోగం సాధించడమే లక్ష్యం.

– గారంపెల్లి వికాసిని, పరకాల, సాఫ్ట్‌బాల్

ఒలింపిక్స్‌లో ఆడాలి



రాష్ట్ర స్థాయిలో ఆరు సార్లు చాంపియన్‌గా నిలిచి బంగారు పతకాలు సాధించడం మరిచిపోలేను. కేరళలో గతేడాది నిర్వహించిన ఉమెన్స్ సౌత్ జోన్‌లో సిల్వర్ మెడల్ సాధించా. కోచ్ నాగరాజు ఎప్పటికప్పుడు కొత్త మెళకువలు నేర్పిస్తూ, కఠోరా శిక్షణ ఇస్తున్నాడు. 2036లో భారతదేశంలో జరిగే ఒలింపిక్స్‌లో పాల్గొనడమే లక్ష్యంగా సాధన చేస్తున్నా.

– ఇ.అక్షిత, జూడో క్రీడాకారిణి

సాక్షి క్లాసిఫైడ్స్

ఎస్టీ విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్ నాయక్


మాట్లాడుతున్న హుస్సేన్ నాయక్

హన్మకొండ: ఎస్టీ విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోతు హుస్సేన్ నాయక్.. టీజీ ఎన్పీడీసీఎల్ ఛైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డిని ఆదేశించారు. శనివారం హనుమకొండలోని టీజీ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో విద్యుత్ ఎస్టీ ఉద్యోగులతో హుస్సేన్ నాయక్ సమావేశమయ్యారు. ఎస్టీ విద్యుత్ ఉద్యోగుల నుంచి ఫిర్యాదులు, వినతి పత్రాలు స్వీకరించారు. సమస్యలు పరిష్కరించాలని సీఎండీకి సూచించగా స్పందించిన ఆయన పరిశీలించి నిర్ణయం తీసుకుంటానన్నారు. ఈ సందర్భంగా హుస్సేన్ నాయక్ మాట్లాడుతూ ఎస్టీలకు అన్యాయం జరిగితే కమిషన్ సహించదన్నారు. కమిషన్‌కు విస్తృత పరిధి ఉందన్నారు. తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. గత సీఎండీ హయాంలో ఎన్పీడీసీఎల్‌లో ఎస్టీ విద్యుత్ ఉద్యోగులకు ఇబ్బందులు కలిగించారన్నారు. అకారణంగా, చిన్న పొరపాట్లకు పెద్దఎత్తున చర్యలు తీసుకున్నారని, ఆర్థిక నష్టం కలిగించారన్నారు. వీటన్నింటిని యాజమాన్యం సమీక్షించి న్యాయం చేయాలన్నారు. సమావేశంలో ఇన్‌చార్జి డైరెక్టర్లు సదర్‌లాల్, అశోక్ కుమార్, వి.మోహన్ రావు, ఎస్టీ విద్యుత్ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఎన్పీడీసీఎల్ కంపెనీ అధ్యక్షుడు వాలు నాయక్, ప్రధాన కార్యదర్శి అజ్మీరా శ్రీరాం నాయక్ పాల్గొన్నారు.

పోలీస్ కార్యాలయంలో ఎస్టీ కేసులపై సమీక్ష

వరంగల్‌క్రైం : వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్ నాయక్ శనివారం ఎస్టీ కేసులపై సమీక్ష జరిపారు. ముందుగా హుస్సేన్ నాయక్‌కు పరిపాలన విభాగం అదనపు డీసీపీ రవి స్వాగతం పలికారు. అనంతరం హుస్సేన్‌నాయక్.. సమీక్ష చేశారు. కమిషనరేట్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న ఎస్టీ కేసుల వివరాలతోపాటు, బాధితులకు అందజేయాల్సిన నష్టపరిహారం వివరాలు అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించడంతోపాటు బాధితులకు సత్వరమే నష్టపరిహారాన్ని అందజేయాలని సూచించారు.

నిబంధనలు పాటించని కళాశాలలపై చర్యలు

- ప్రిన్సిపాల్స్ సమావేశంలో కేయూ రిజిస్ట్రార్ మల్లారెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న మల్లారెడ్డి

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని అనుబంధ డిగ్రీ కళాశాలలను తనిఖీ చేస్తామని, నిబంధనలు పాటించని వారిపై కఠినచర్యలు తీసుకుంటామని కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి హెచ్చరించారు. కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్, అటానమస్, గురుకుల డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాల్స్‌తో శనివారం క్యాంపస్‌లోని పరిపాలన భవనంలోని సెనేట్ హాల్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అనుబంధ కళాశాలలు బలోపేతం కావాలన్నారు. అంతర్గత, ప్రాక్టికల్స్ పరీక్షలు తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. కేయూ పరిధిలో 297 కళాశాలలకు 197 కళాశాలల బోధన సిబ్బంది వివరాలను సంబంధిత పోర్టల్‌లో నమోదు చేశారన్నారు. వివిధ కళాశాలల ప్రిన్సిపాల్స్ లేవనెత్తిన సందేహాలను రిజిస్ట్రార్ నివృత్తి చేశారు. కేయూ అకడమిక్ డీన్ జి.హనుమంతు, పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎస్.నర్సింహాచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ తిరుమలాదేవి, ఆడిట్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ డాక్టర్ కోల శంకర్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఆచార్య ఈసం నారాయణ, స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ ఆచార్య వై.వెంకయ్యతో పాటు తదితరులు పాల్గొని మాట్లాడారు.

సర్వీస్ నుంచి స్వామి రిమూవ్

- ఉత్తర్వులు జారీ చేసిన టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ

హన్మకొండ: అవినీతికి పాల్పడిన విద్యుత్ అధికారి రేగుంట స్వామిని ఉద్యోగం నుంచి తొలగిస్తూ టీజీ ఎన్పీడీసీఎల్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. టీజీ ఎన్పీడీసీఎల్ ఆదిలాబాద్ రూరల్ సబ్ డివిజన్‌లో అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ (ఆపరేషన్)గా రేగుంట స్వామి పని చేస్తున్న సమయంలో ఇచ్చోడ మండలం సిరిచెల్మకు చెందిన గుండాల కన్నమయ్య మరికొంతమంది రైతులతో కలిసి తత్కాల్ స్కీమ్‌లో భాగంగా 2010 జనవరి 12న వ్యవసాయ సర్వీస్ కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఆ దరఖాస్తు స్థానిక అధికారుల నుంచి అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్(ఏడీఈ) రేగుంట స్వామికి చేరింది. రైతులు ఏడీఈని కలవగా ఆయన రూ.30 వేలు డిమాండ్ చేశాడు. తాము అంత మొత్తం ఇవ్వలేమని చెప్పడంతో రూ.15 వేలు ఇవ్వాలని డిమాండ్ చేయగా, అవినీతి నిరోధక శాఖను సంప్రదించారు. దీంతో 2010 నవంబర్ 1న రైతుల నుంచి రూ.15 వేలు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని కేసు నమోదు చేశారు. ప్రాసిక్యూషన్ తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాదించారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన ఏసీబీ కోర్టు న్యాయమూర్తి.. రేగుంట స్వామికి ఏడేళ్ల జైలు శిక్ష, రూ.30 వేల జరిమానా విధిస్తూ 2024 ఏప్రిల్, 10న తీర్పు ఇచ్చారు. శిక్ష పడిన రేగుంట స్వామిని సర్వీస్ నుంచి తొలగిస్తూ ఈ నెల 22 (గురువారం)న సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు.

పురోహితుడి ఆత్మహత్య


కృష్ణమాచారి (ఫైల్)

భూపాలపల్లి అర్బన్: ఉరివేసుకుని ఓ పురోహితుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన శనివారం భూపాలపల్లిలో చోటు చేసుకుంది. ఎస్సై సుధాకర్ కథనం ప్రకారం.. పట్టణంలోని సుభాష్‌కాలనీకి చెందిన కొండపర్తి కృష్ణమాచారి(24) పురోహితం చేస్తూ జీవనం కొనగిస్తున్నాడు. ఈ క్రమంలో బుధవారం మంజూర్‌నగర్‌లో నివాసముంటున్న తన సోదరుడు శ్రీకర్ వద్దకు వెళ్లి వచ్చాడు. అప్పటి నుంచి ఎవరికీ కనిపించడం లేదు. ఈ క్రమంలో శనివారం మధ్యాహ్నం ఇంటి నుంచి దుర్వాసన రావడంతో స్థానికులు వెళ్లి చూడగా కృష్ణమాచారి మృతదేహం ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించింది. దీంతో పోలీసులకు సమాచారం అందించారు. ఇదిలా ఉండగా కృష్ణమాచారి మూడు రోజుల క్రితం ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు కనిపిస్తోంది. మెడ భాగంలో పురుగులు కనిపిస్తున్నాయి. కాగా, కృష్ణమాచారి ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

ఆకాశంలో హరివిల్లు..



మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో శనివారం సాయంత్రం చిరుజల్లులు కురిశాయి. అనంతరం ఆకాశంలో హరివిల్లు (ఇంద్రధనస్సు) ఆవిష్కృతమైంది. ఈ హరివిల్లును పిల్లలు, పెద్దలు ఆసక్తిగా తిలకించారు.

–స్టాఫ్ ఫొటో గ్రాఫర్, మహబూబాబాద్